## క్లుప్తంగా

### జెడ్పీ చైర్మన్ దంపతులపై దాడి అమానుషం

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ విజయసారథి



మాట్లాడుతున్న రెవరెండ్ విజయసారథి

**రాజమహేంద్రవరం రూరల్:** ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్మన్ హారిక దంపతులపై టీడీపీ, జనసేన శ్రేణులు దాడి చేయడం అమానుషమని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ విజయసారథి మండిపడ్డారు. కొంతమూరు గ్రామంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రెవ.విజయసారథి మాట్లాడుతూ, బీసీ మహిళ దంపతులు కారులో వెళ్తుంటే, టీడీపీ, జనసేన మూకలు కారు ఆపి, పోలీసుల సమక్షంలో మానవహక్కులను తుంగలోకి తొక్కేలా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వ నిరంకుశ పోకడల్లో ఇది హేయమైన చర్యగా అభివర్ణించారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని, జెడ్పీ చైర్మన్ హారిక కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు జాన్‌వెస్లీ, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఉమ్మూరి నాని, వై.చార్లెస్, టి.గౌతమ్ పాల్గొన్నారు.

### నేడు జాబ్ మేళా

**రాజమహేంద్రవరం సిటీ:** జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు స్థానిక మోడల్ కెరీర్ సెంటర్ ప్రాంగణంలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి హరీష్ చంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ పాటిల్ గ్రూప్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, కిమ్స్, నవతా కంపెనీలో పలు ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఐటీఐ, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం నర్సింగ్, టెన్త్ పూర్తి చేసిన 19–35 ఏళ్ల వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు రెజ్యూమ్‌తో పాటు, ఆధార్, ఇతర సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో సోమవారం ఉదయం పది గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 95332 21189 నంబరులో సంప్రదించాలని కోరారు.

### ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

**రాజమహేంద్రవరం సిటీ:** పరిసరాల పరిశుభ్రతకు జాతీయ సేవా పథకం వలంటీర్లు నిరంతరం కృషి చేస్తారని ఆదిత్య ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నగరంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రాంగణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను వలంటీర్లు తొలగించారు. కార్యక్రమంలో సొసైటీ మెంబర్ డాక్టర్ మహాలక్ష్మి, జిల్లా కో–ఆర్డినేటర్ పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### రాజేశ్వరి సేవలు చిరస్మరణీయం



రాజేశ్వరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

**రాజమహేంద్రవరం సిటీ:** మాజీ కౌన్సిలర్, దివంగత అల్లు రాజేశ్వరి అందించిన సేవలు నిరుపమానమని తూర్పుగోదావరి జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంఘం నివాళులర్పించింది. ఆదివారం స్థానిక జేఎన్ రోడ్డులోని అల్లు బాబీ స్వగృహంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. కోనే శ్రీను అధ్యక్షత వహించిన ఈ సభలో తొలుత రాజేశ్వరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఏపీ నారాయణ రావు మాట్లాడుతూ, 1987లో కౌన్సిలర్‌గా ఎన్నికైన రాజేశ్వరి అందరితో సఖ్యతగా మెలుగుతూ, ఎన్నో సమస్యలు పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఆమె బాటలో కుమారుడు అల్లు బాబీ 2003లో కార్పొరేటర్‌గా సేవలు అందించారన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ రాజేశ్వరి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆమె మరణం తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కేత శ్రీను, సిరి శ్రీను, ప్రభాకర్, లక్ష్మీనారాయణ చౌదరి, ప్రభాకర్, సన్నపు శాంతి బాబు, గోకవరం బాలు, బుడ్డిగా రాధా, గల్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్

**సీతానగరం:** చీపురుపల్లి పంచాయతీలోని అచ్చయ్యపాలెంలో మిడిల్ కాయిన్ ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్ట్ చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారంతో సిబ్బందితో దాడి చేసి, 9 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.18 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరు పర్చుతామని తెలిపారు.




సాయినగర్‌లోని ఫ్లోరా పార్కు



సాయినగర్ మెయిన్ రోడ్‌లో నిత్యం తాళం వేసి ఉండే కార్పొరేషన్ పార్కు

# అధ్వాన వనాలు

- పార్కుల్లో మౌలిక వసతుల కొరత
- నగరపాలక సంస్థ నిర్లక్ష్యంతో సందర్శకులకు ఇబ్బందులు
- వృద్ధులు, మహిళల ఆవేదన

**రాజమహేంద్రవరం సిటీ:** నగరపాలక సంస్థ సాధారణ నిధులతో చేపట్టిన అభివృద్ధి, ఆధునీకరణ కార్యక్రమాల్లో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. పార్కుల ఆధునీకరణ పనుల్లో మౌలిక వసతులు కల్పనకు ఏ మాత్రం శ్రద్ధ పెట్టకపోవడంతో, సందర్శకులకు ఇబ్బందులు తప్పడం లేదు. నగరంలోని పదో డివిజన్ సాయినగర్‌లో రూ.70 లక్షలతో అభివృద్ధి చేసిన ఫ్లోరా పార్క్‌లో కనీస వసతులు కరవయ్యాయి. నిత్యం వందలాది మంది ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కు సందర్శనకు వస్తుంటారు. ఈ పార్కును 2023 నవంబర్ 8న రూ.70 లక్షల నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. మూడు నెలల కాలంలో గతేడాది జనవరి రెండున అభివృద్ధి పనులు పూర్తి కావడంతో అప్పటి ఎంపీ మార్గాని భరత్‌రామ్ దీనిని ప్రారంభోత్సవం చేశారు. రూ.70 లక్షలతో ఆధునీకరణ పేరుతో సందర్శకులు ఆహ్లాదంగా గడిపేందుకు సిమెంట్ బెంచీలు, చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, శారీరక వ్యాయామం కోసం రెండు షటిల్ కోర్టులను ఏర్పాటు చేశారు. **అభివృద్ధి చేసే సమయంలో పార్కులో మహిళలు, వృద్ధులు, చిన్నారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహించారు. పార్కుకు ఉదయం సాయంత్రం వేళల్లో సందర్శనకు వచ్చే వృ**ద్ధులు, మహిళలు, చిన్నారులకు వాష్ రూమ్‌లు, మంచినీరు వంటివి ఏర్పాటు చేయడంలో కనీస ఆలోచన చేయలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పార్కుకు వచ్చే మహిళలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే నిత్యం పార్కుకు వచ్చే సందర్శకులు వినియోగించి, పారవేసే వ్యర్థాలను వేసేందుకు డస్ట్ బిన్లు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

**నిత్యం తాళం వేసి..**

**పదో డివిజన్ సాయినగర్ మెయిన్ రోడ్‌లోని సాయిచైతన్యనగర్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన పార్కును లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమ**హేంద్రవరం దత్తత తీసుకుంది. ఈ పార్కు ఎవరికీ అందుబాటులో లేకుండా, నిత్యం తాళం వేసే ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. పార్కుకు తాళం వేసి ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో సందర్శకులు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, లయన్స్ క్లబ్ దత్తత తీసుకున్న ఈ పార్కును ఉదయం, సాయంత్రం వేళల్లో తెరిచి ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ ఉద్యానవన అధికారి అనితను వివరణ కోరగా, క్షేత్ర స్థాయిలో పర్యటించి పార్కులో అవసరమైన మౌలిక వసుతుల కల్పనకు చర్యలు చేపడతామన్నారు.

### వర్షం వస్తే తడవాల్సిందే..

ఇలాఉండగా వర్షం కురిసిన సందర్భాల్లో తల దాచుకునేందుకు ఏ విధమైన షెల్టర్ లేకపోవడం వల్ల సందర్శకులు తడిసిపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, సాయినగర్ ఫ్లోరా పార్కులో కనీస సదుపాయాలతో పాటు, షెడ్ నిర్మాణం చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

### మౌలిక వసతులు కల్పించాలి



పార్కుల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం ఇబ్బందికరమే. లక్షలాది రూపాయలతో వీటిని ఆధునీకరించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు వాష్ రూమ్‌లు, సందర్శకుల దాహార్తిని తీర్చేందుకు డ్రింకింగ్ వాటర్‌ను ఏర్పాటు చేయకపోవడం దారుణమైన విషయం. నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించి, ఫ్లోరా పార్కులో వాష్ రూమ్, డ్రింకింగ్ వాటర్ వంటి సదుపాయాలను కల్పించాలి.

– ఎస్.దేవి, రాజమహేంద్రవరం


### పార్కు తెరవాలి



నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సాయినగర్ మెయిన్ రోడ్‌లో నిర్మించిన లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం దత్తత తీసుకున్న పార్కును స్థానికులకు అందుబాటులోకి తేవాలి. పార్కుకు వెళ్లేందుకు స్థానికులు, పరిసర ప్రాంతాల వారంతా ఎల్లప్పుడూ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పార్కులో క్లబ్ కార్యక్రమాలు జరిగినప్పుడు మాత్రమే పార్కు తెరిచి, వెనువెంటనే మూసివేస్తున్నారు. దీనిపై నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించి, ఈ పార్కును సందర్శకులకు అనుకూలంగా ఉదయం, సాయంత్రం వేళల్లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి.

– టీడీఏ రెడ్డి, రాజమహేంద్రవరం

### శాకంబరి దేవిగా ఒనువులమ్మ తల్లి



శాకంబరి అలంకారంలో ఒనువులమ్మ తల్లి

**రాజమహేంద్రవరం రూరల్:** తొర్రేడు గ్రామంలోని ఒనువులమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారు శాకంబరి దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష పూజల అనంతరం లలిత సహస్ర నామ పారాయణం, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయం మొత్తం కురగాయలతో, పండ్లతో అలంకరించారు. భక్తుల రాకతో ఒనువులమ్మ ఆలయం కిటకిటలాడింది. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

### ఫుట్‌బాల్ టోర్నీ విజేత అనంతపురం జట్టు

**రాజానగరం:** చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలని స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో రెండు రోజులుగా జరిగిన ఏపీ సబ్ జూనియర్ బాలుర (అండర్–13) ఫుట్ బాల్ చాంపియన్‌షిప్–2025 పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలో విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన అనంతపురం, కృష్ణా జిల్లా జట్లకు ట్రోఫీలను అందజేశారు. ముగింపు సభకు ఐకాన్స్ ప్రెసిడెంట్ ఎం.వెంకన్నబాబు అధ్యక్షత వహించారు. చాప్టర్ ప్రెసిడెంట్ తీగల రాజా మాట్లాడుతూ, ఈ పోటీలకు తొమ్మిది జిల్లాల నుంచి 275 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి, జీజీయూ వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 50 ఏళ్లు పూర్తవడం ఆనందంగా ఉంది



జిత్‌మోహన్ మిత్రను సత్కరిస్తున్న ప్రముఖులు

**'ముత్యాలముగ్గు' సినిమాపై నటుడు జిత్‌మోహన్ మిత్ర**

**ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** తాను నటించిన తొలి సినిమా ముత్యాల ముగ్గు 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం, హైదరాబాద్‌లో సత్కారం పొందడం ఆనందంగా ఉందని నటుడు, గాయకుడు జిత్‌మోహన్ మిత్ర అన్నారు. ముత్యాల ముగ్గు 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో సత్కారం పొందిన జిత్‌మోహన్‌మిత్రకు ఆదివారం సాయంత్రం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద జిత్ మోహన్ మిత్ర కళావేదికలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిత్‌మోహన్ మిత్రను మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, ముద్రగడ ఏసుబాబు, జల్లి శివప్రసాద్, వి.జగపతిరావు, బి.సీతారామారావు, సీహెచ్ విశ్వనాథ్, శ్రీనివాస్, జీవీఎస్ లక్ష్మీతులసి, ఫణి తదితరులు ఘనంగా పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. తొలుత విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మరణానికి సమావేశంలో సంతాపం తెలిపి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయనతో అనుబంధాన్ని వక్తలు గుర్తు చేసుకున్నారు. కోటతో 50 సినిమాల్లో కలిసి నటించినట్లు జిత్ తెలిపారు. ప్రముఖులు గుంటూరు శ్రీనివాసరావు, పోస్టల్ ప్రసాద్, డీఎస్ఎస్ శ్రీనివాస్, పిచ్చుక మహేష్, నాగేంద్ర, డాక్టర్ హరి తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ మిల్ కార్మికుల సమస్యలపై కార్యాచరణ



జక్కంపూడి రాజా

**రాజమహేంద్రవరం సిటీ:** సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలపై వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధమైంది. ఈ నెల 14వ తేదీ లోపు కార్మికుల సమస్యలకు ముగింపు పలకని పక్షంలో, కార్మికుల తరపున ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని 9వ తేదీన జక్కంపూడి రాజా విలేకరుల సమావేశంలో హెచ్చరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్, కార్మిక శాఖ అధికారులు, యాజమాన్య ప్రతినిధులు, యూనియన్ నాయకులతోనూ సమావేశంలో చర్చించి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో మరోసారి సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్మికుల న్యాయమైన డిమాండ్లపై యాజమాన్యంతో మాట్లాడి సానుకూల నిర్ణయానికి తీసుకొస్తామని స్వయంగా మంత్రి బాధ్యత తీసుకుని ప్రకటించారు. దీంతో ముందుగా ప్రకటించినట్టుగా కాకుండా, 17వ తేదీ సాయంత్రం లోపు కార్మికుల సమస్య పరిష్కారం కాని పక్షంలో ఆమరణ నిరాహార దీక్ష తేదీ, తదుపరి కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తానని జక్కంపూడి రాజా ఆదివారం ప్రకటించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏవిధమైన చర్యలు చేపట్టారనే దానిపై ఎప్పటి కప్పుడు పరిస్థితిని తెలుసుకునేందుకు పేపరుమిల్లు ఎదురుగా కల్యాణ మండపంలో సోమవారం ఉదయం నుంచి ఏ రకమైన ఆర్భాటాలు లేకుండా, ఒక్కడినే పర్యవేక్షిస్తానని జక్కంపూడి రాజా స్పష్టం చేశారు.

## 24న చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవం



సమావేశంలో పాల్గొన్న సంఘ ప్రతినిధులు

**రాజమహేంద్రవరం సిటీ:** దేవాంగ కుల దేవత చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాన్ని ఈ నెల 24వ తేదీన ఆషాఢ అమావాస్య రోజున స్థానిక జాంపేట ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు దేవాంగ సంఘం నగర ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆదివారం స్థానిక జాంపేట ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో సంఘ నగర అధ్యక్షుడు రొబ్బి విజయ్‌శేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు, సాయంత్రం అమ్మవారికి మహిళలతో సారె, భారీ ఊరేగింపు ఉంటుందన్నారు. సమావేశంలో రాష్ట్ర దేవాంగ అధికార ప్రతినిధి కేకే సంజీవరావు, నాయకులు బీరా శ్యామలరావు, చింతా వెంకట చలపతి, బళ్లా శ్రీనివాసరావు, పూర్ణిమ ప్రసాద్, బీరా పద్మనాభరావు, మావూరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అక్కమ్మ తల్లి జాతర



కొండపై కొలువైన అక్కమ్మతల్లి



వివిధ వేషధారణల్లో కళాకారులు

**రాజమహేంద్రవరం రూరల్:** శాటిలైట్‌సిటీ గ్రామ దేవత కొండపై కొలువైన గురజాల అక్కమ్మతల్లి 34వ జాతర మహోత్సవాలు ఉత్సవ కమిటీ, అభ్యోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా జరిగాయి. అపార్ట్‌మెంట్ల నుంచి వివిధ వేషధారణలు, డప్పులు, గరగ నృత్యాలు, శక్తివేషాలతో ఊరేగింపు ఏ, బీ, సీ బ్లాకుల మీదుగా ఆలయానికి చేరింది. భారీ బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి అధికసంఖ్యలో అక్కమ్మతల్లిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తూర్పుజోన్ డీఎస్పీ బి.విద్య ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

# ఫ్లైఓవర్?

- ఏడీబీ రోడ్డులో వంతెన హుళక్కేనా?
- జంక్షన్‌లో కల్వర్టుల స్థానే తూరలు
- కొత్త కాలనీకి ముంపు భయం

**రాజానగరం:** ఏవో అద్భుతాలు చేసేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు.. తమకు అనుకూలంగా పనులు చక్కబెట్టుకుంటూ, ప్రజలను కష్టాల్లోకి నెట్టేస్తోన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలు అభివృద్ధి ప్రణాళికల్లోనూ కూటమి నేతలు గందరగోళం సృష్టిస్తూ.. 'లబ్ధి' పొందేందుకు లేనిపోని ప్రయత్నాలు చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో ఏడీబీ రోడ్డు అభివృద్ధి పనులు కొన్నేళ్లుగా నిలిచిపోయాయి. 16వ నంబరు జాతీయ రహదారిపై స్థానిక జెడ్పీ హెచ్ స్కూల్ (కలవచర్ల జంక్షన్) నుంచి కాకినాడ వరకు 57 కిలోమీటర్ల మేర ఉన్న ఏడీబీ రోడ్డును మధురపూడి ఎయిర్ పోర్టు రోడ్డుకు అనుసంధానం చేయడంలో భాగంగా నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి పరుస్తూ దశాబ్ద కాలం క్రితం ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు సహకారంతో పనులు చేపట్టారు. ఇందులో భాగంగా జెడ్పీ హెచ్ స్కూల్ జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉంది. ఫ్లైఓవర్ నిర్మాణం జరగాల్సిన ప్రాంతంలో కొన్నేళ్లుగా అభివృద్ధి కూడా నిలిచిపోయింది. గ్రామంలో సాయిబాబా మందిరం వైపు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు విస్తృతంగా అభివృద్ధి చెందుతుంటే, ఈ ప్రాంతంలో మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మిస్తే ప్రస్తుతం ఉన్న వ్యాపార దుకాణాలన్నీ మరుగున పడిపోతాయని, వ్యాపార లావాదేవీలు పుంజుకునే అవకాశాన్ని కోల్పోవాల్సి వస్తుందని వ్యాపారులు అంటున్నారు. దీంతో ఇప్పటికే నిర్మించి ఉన్న దుకాణాల్లో అరకొరగా వ్యాపారాలు జరుగుతున్నా కానీ, కొత్తగా స్థలాలు కొని, దుకాణాలు ఏర్పాటు చేసేందుకు మాత్రం వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. ఈ కారణంగా ఈ ప్రాంతంలో భూమి ధరలు కూడా మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే చాలా తక్కువగా పలుకుతున్నాయి.

**పునః ప్రారంభం!**

నిధుల లేమితో కొంతకాలంగా నిలిచిపోయిన ఏడీబీ రహదారి విస్తరణ పనులు ఇటీవల కాలంలో పునఃప్రారంభమయ్యాయి. అయితే రహదారి విస్తరణ వరకు పనులు జరుగుతున్నా కానీ, ముందుగా పేర్కొన్న విధంగా ఫ్లైఓవర్‌కి సంబంధించిన పనులు మాత్రం జరగడం లేదు. దీనిపై స్థానికంగా పలు రకాలుగా ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ పెద్దలతో రాజకీయంగాను, సామాజికంగాను సంబంధాలు కలిగిన ఓ వర్గం తమ వ్యాపార లావాదేవీలకు ఇబ్బంది కలగకుండా చక్రం తిప్పిందని, ఆ కారణంగానే ప్రస్తుతం ఫ్లైఓవర్ పనుల ప్రస్తావన లేకుండా రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయంటున్నారు. ఇందులో వాస్తవం ఎంతనే విషయమై ప్రశ్నిస్తే.. సంబంధిత అధికారులు కూడా నోరు మెదపకపోవడం గమనార్హం.

**తరచూ ముంపు సమస్య!**

ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ జంక్షన్ వద్ద ముంపునీరు దిగువకు వెళ్లేందుకు వీలుగా కల్వర్టును నిర్మించాల్సి ఉంది. ఆ ప్రాంతంలో తూరలు వేసి మమ అనిపిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికే జాతీయ రహదారిపై ఈ ప్రాంతంలో కల్వర్టును నిర్మించకపోవడం వల్ల భారీ వర్షాల సమయంలో గ్రామంలోని కొత్తకాలనీ, సుబ్బారావు కాలనీలు తరచూ ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఏడీబీ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వేస్తున్న తూరల వల్ల ఈ సమస్యకు పరిష్కారం లభించకపోగా, మరింత తీవ్రమయ్యేందుకు అవకాశం లేకపోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ జంక్షన్‌లో జాతీయ రహదారి దిగువన ప్రస్తుతం ఉన్న సింగిల్ తూరకు ఏడీబీ రహదారికి ఇరువైపులా నిర్మిస్తున్న సీసీ డ్రైన్లను అనుసంధానం చేయడం వల్ల ముంపు తీవ్రత మరింత పెరిగి, రెండు కాలనీలతో పాటు గ్రామంపై కూడా ముంపు ప్రభావం ఉంటుందంటున్నారు.



కల్వర్టు నిర్మించాల్సిన ఏడీబీ రోడ్డు జంక్షన్‌లో వేసిన తూరలు

### ఎవరి కోసమో ఆపేస్తారా?

ప్రభుత్వాలు ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర ప్రగతిని ఆలోచించి పథకాలు అమలు చేయాలి కానీ, ఏ ఒక్కరికో నష్టం వాటిల్లుతుందని పది మందికి ఉపయోగపడే పనులను ఆపించడం సరి కాదు. ఏడీబీ రోడ్డు విస్తరణలో భాగంగా రాజానగరంలో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం భూసేకరణ చేశారు. ఇప్పుడు అక్కడ రహదారి విస్తరణ మాత్రమే అంటూ, ఫ్లైఓవర్‌ని పక్కన పెట్టారంటున్నారు. స్థానికంగా ఉండే ఓ వ్యాపారవేత్త కోసం ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ముడిపడి ఉన్న ఫ్లైఓవర్ ఏర్పాటును పక్కన పెట్టడం క్షమించరానిది.

– దూలం పెద్ద, మండల కన్వీనర్, వైఎస్సార్ సీపీ, రాజానగరం

### కల్వర్టులు నిర్మించాలి

గ్రామంలో ఏడీబీ రోడ్డు ప్రారంభమయ్యే జంక్షన్‌లో ముంపు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా కల్వర్టులు నిర్మించాలి. ప్రస్తుతం తూతూమంత్రంగా తూరలు వేయడం వల్ల ఇప్పటికే ముంపు బెడదతో సతమవుతున్న కొత్త కాలనీ, సుబ్బారావు కాలనీలతో పాటు, గ్రామం కూడా ముంపు బారిన పడే ప్రమాదం ఉంది. ఈ విషయమై ఇంజినీరింగ్ అధికారులు లోతుగా ఆలోచించి, సరైన నిర్ణయం తీసుకోవాలి.

– మోది సత్తిబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి, బీజేపీ, రాజానగరం